
## సింగిల్ పేజీ కథలు

# మంచితనం



"నిన్నట్నుంచీ పద్మజ యింట్లో కూడా నీళ్ళు రావడం లేదట" అంది నిర్మల భర్త బాలాజీతో.

"అయితే మన కాలనీలో మన యింటి బోరులోనే నీళ్ళు యింకా వస్తున్నాయన్నమాట. పాపం జనం నీళ్ళ కోసం ఎంత అల్లాడిపోతున్నారో" అన్నాడు బాలాజీ బాధగా.

"ఇప్పటికే మనం అయిదు ఇళ్ళకు త్రాగడానికి నీరు వదులుతున్నాం. ఇక పద్మజా వాళ్ళకు కూడా మనమే యివ్వాలి"

"తప్పదు. సాటి మనిషిగా మనం సహాయం చేయాలి. అది మన ధర్మం" అన్నాడు బాలాజీ.

ఇంతలో ఎవరో పిలిస్తే బయటకు వెళ్ళింది నిర్మల. కాసేపటి తర్వాత లోపలికొచ్చి "వందన వాళ్ళ ప్రక్కింటావిడ, కొత్తగా వచ్చారు ఈ ఊరికి. త్రాగడానికి నీళ్ళు ఒక బిందె పట్టుకొంటానని అడిగింది. ఇప్పుడే ట్యాంకు నిండిందని, మళ్ళీ మోటారు వేస్తే నీళ్ళు వృధా అవుతాయని, సాయంత్రం వస్తే మోటారు వేస్తానని చెప్పాను" అంది భర్తతో.

"అలాగా. సాయంత్రం వస్తే తప్పకుండా యివ్వు"

"అందరికీ యిస్తూ పోతే రేపు మన బోరు కూడా ఎండిపోతే అప్పుడేం చెయ్యాలి"

"ఇంతవరకూ చూసుకొన్న భగవంతుడు తర్వాత మాత్రం చూసుకోడా? ఈ లోపల వానలు కురియవచ్చు. మనం సహాయం చేయగలిగీ చేయకుండా ఉండటం తప్పు"

"నేను సహాయం చెయ్యనని అనలేదు. ఆ పరిస్థితి వస్తే ఏం చేయాలో ఆలోచించుకొని ఉందాము అన్నాను" అంది నిర్మల.

ఆ రోజు సాయంత్రం వందన ప్రక్కింటావిడ వచ్చి ఒక బిందె నీళ్ళు పట్టుకొని వెళ్ళింది. అయితే ఆమె ప్రతి రోజూ వచ్చి నీళ్ళు తీసుకెళ్ళడం చూసి భార్యాభర్తలిద్దరూ ఆశ్చర్యపోయారు.

"అదేమిటి? ఆవిడ నీళ్ళు అడిగింది. ఒక్క రోజుకే కాదా" అని భార్యని అడిగాడు బాలాజీ.

"అవునండీ. ఒక్కరోజుకనే చెప్పింది"

"మరి రోజూ తీసుకెళుతుందేమిటి? కనీసం మనల్ని అడగాలన్న జ్ఞానం కూడా లేకపోతే ఎలా? నీళ్ళు తీసుకెళతానంటే మనం వద్దంటామా? రేపు ఆవిడ వచ్చినప్పుడు నేను అడుగుతాను"

"వద్దండీ. ఎందుకు అనవసరంగా గొడవపడటం"

"నేను గొడవ పడను. నీళ్ళు ప్రతిరోజూ కావల్సి ఉంటుందని మాకొక మాట చెప్పి ఉండాల్సింది మీరు అని చెబుతాను. వాళ్ళ తప్పు వాళ్ళకూ తెలియనీ".

మరునటి రోజు ఆవిడ రాగానే ఆమెకు ఎదురుగా వెళ్ళాడు. అయితే చెప్పాలనుకొన్నది మాత్రం చెప్పలేకపోయాడు. ఆమె అతనిని చూసి పలకరింపుగా నవ్వింది. తనూ నవ్వి లోపలకు వచ్చేశాడు.

"అడిగారా" అని భర్తను అడిగింది నిర్మల.

లేదన్నట్టు తల అడ్డంగా ఊపాడు.

"నాకు తెలుసు. మీరు అలా మాట్లాడలేరు" అంటూ నవ్వింది.

* * *

కొద్దిరోజుల్లోనే ఆవిడ నిర్మలకు క్లోజ్ అయింది. ఆవిడ పేరు అంబిక. నిర్మలకు సాయంత్రాలు వాకింగ్‌కు తోడు ఎవరూ లేరని తెలిసి తను వస్తానని చెప్పింది. రోజు కబుర్లు చెప్పుకుంటూ వాకింగ్ చేయసాగారు. వీళ్ళను చూసి కాలనీలోని మరో నలుగురు మహిళలు వీళ్ళతో జత కలిసారు.

ఒక శనివారం మధ్యాహ్నం నిర్మల యింటికొచ్చింది అంబిక. పిల్లలకు భోజనం పెడుతున్న నిర్మలతో మాట్లాడుతూ కూర్చుంది. మాటల మధ్య-

"మీది ప్రేమ వివాహం కదూ" అని అడిగింది నిర్మలను.

"కాదు. పెళ్ళయ్యాక ప్రేమించుకొంటున్నాం" అంటూ నవ్వి "ఎందుకా అనుమానం వచ్చింది మీకు" అని అడిగింది నిర్మల.

"మీ ఆయన మీకు అన్ని విధాలా సహాయం చేయడం చూస్తూంటాను రోజూ. అందుకే అనుమానం వచ్చింది. అవునూ ఈరోజు ఉదయం మీ హీరో కనబళ్ళేదే. ఊర్లో లేరా?"

"లేరు. నిన్న మా మరిది ఊరి నుంచి వచ్చారు. ఇద్దరూ కలిసి బెంగళూరు వెళ్ళారు. మా ఆయన ఫ్రెండ్ అక్కడ ఒక మంచి కంపెనీలో పని చేస్తున్నారు. మా మరిదికి ఉద్యోగం అడగడానికి వెళ్ళారు."

"ఏ కంపెనీ అది?"

కంపెనీ పేరు చెప్పింది నిర్మల.

"అరె.. ఆ కంపెనీ జి.ఎమ్. మా బావగారే. మీ ఆయనకు సెల్ ఉందా" అని అడిగింది అంబిక.

"ఉంది"

"అయితే మీరు వెంటనే మీవార్ని కాంటాక్ట్ చేసి ఆ కంపెనీ జి.ఎమ్. శ్రీపాదమూర్తిని కలిసి నేను పంపినట్లు చెప్పి మీ మరిది ఉద్యోగ విషయం మాట్లాడమని చెప్పండి. మీ మరిది పేరేమిటి?"

"శివాజీ"

"నేను యిప్పుడే వస్తాను. ఈ లోపల మీరు నేను చెప్పిన పని చెయ్యండి" అంటూ వెళ్ళిపోయింది అంబిక.

పది నిమిషాల తర్వాత వచ్చి "మీవారు దొరికారా?" అని అడిగింది.

"దొరికారు. మీరు చెప్పింది చెప్పాను"

"నేనూ మా బావగారికి ఫోన్ చేసి మీ మరిది విషయం చెప్పాను. తప్పకుండా ఉద్యోగం యిస్తానన్నారు. గత ఆదివారం ఆయన యిక్కడే ఉన్నారు. తమ కంపెనీ ఆర్థిక లావాదేవీలు చూసుకోవడానికి నమ్మకస్థుడైన వ్యక్తి ఫైనాన్స్ మేనేజరు పోస్టుకు కావాలని, ఇదివరకు ఉన్నతను డబ్బులు కాజేసి వెళ్ళిపోయాడని, రోజురోజుకీ నమ్మకంగా పనిచేసేవారు కరువవుతున్నారని అన్నారు. మంచి సమయానికి మీ మరిది విషయం చెప్పారు. దీనివల్ల అటు మీ మరిది సమస్యా తీరుతుంది, మా బావగారి సమస్యా తీరుతుంది."

"మా మరిది నమ్మకస్థుడని మీకెలా తెలుసు" నవ్వుతూ అడిగింది నిర్మల.

"ఆయన మీ ఆయనకు తమ్ముడు కనుక తప్పకుండా నమ్మకస్థుడే అయి ఉంటాడు" అంది అంబిక స్థిరంగా.

"మా ఆయన మంచితనం గురించి మాత్రం మీకు తెలుసా?"

"ఆయనను చూస్తే ఎవరైనా చెబుతారు ఆయన సిన్సియర్, హానెస్ట్ అండ్ కమిటెడ్ అని" అంది అంబిక. ఆ మాటలు విని తన భర్త గురించి ఎంతో గర్వపడింది

నిర్మల.

ఆ రోజు రాత్రి స్వీట్ పేకెట్‌తో యింటికి వచ్చిన బాలాజీ, శివాజీలను చూసి విషయం అర్థమైంది నిర్మలకు. తనకు ఉద్యోగం దొరికిందని, మంచి జీతం ఆఫర్ చేశారని, వారం రోజుల్లో డ్యూటీలో చేరాలని, అంబిక పేరు చెప్పగానే శ్రీపాదమూర్తి ఉద్యోగం యిచ్చారని ఆనందంగా చెప్పాడు శివాజీ.

"రేపు ఉదయాన్నే అంబిక యింటికి వెళ్ళి ఆమెకు థాంక్స్ చెప్పి వస్తాను" అంది నిర్మల.

"అలాగే. చూశావా. ఆ రోజు నేను కోపంతో ఆమెను ఓ మాట అనబోయి మానుకొన్నాను. ఆ మాట అననందువల్ల ఆమె ఈరోజు మనకు ఎంతో గొప్ప సహాయం చేశారు. అందుకే అనవసరంగా మాట జారవద్దని మన పెద్దలన్నారు" అన్నాడు బాలాజీ.

"ఈ మాట మాత్రం ముమ్మాటికీ నిజం" అంది నిర్మల.

**-సి.ఎస్.చంద్రశేఖర్ (చిత్తూరు)**

# మూర్ఖత్వం

అకౌంటెంట్ శ్రీధర్ భయం భయంగా ఆఫీసుగదిలో అడుగుపెట్టేడు. ఆఫీసర్ రంగనాథం సీరియస్‌గా ఏదో ఫైలు చూస్తున్నాడు. తన ఉనికిని తెలియజేయడానికి శ్రీధర్ చిన్నగా దగ్గేడు. "సార్!" నసిగేడు శ్రీధర్.

లీవు కావలసి వచ్చినప్పుడే ఇలా నసుగుతారని రంగనాథానికి బాగా తెలుసు. మాట్లాడితే చాలు లీవు. ఏదో చచ్చు కారణం చెబుతారు. లీవుల దగ్గర రంగనాథం చాలా స్ట్రిక్ట్‌గా వుంటాడు. ఒక పట్టాన ఎవరికీ లీవు శాంక్షను చెయ్యడు. ఆయన లీవు శాంక్షను చేసేడంటే ప్రమోషన్ వచ్చినంత సంబరపడిపోతారు క్రింది ఉద్యోగులు.

"ఎస్!" అన్నాడు సీరియస్‌గా రంగనాథం.

"సార్! మా అమ్మగారికి సీరియస్‌గా వుందట. ఫోను వచ్చింది. నాలుగు రోజులు లీవుకావాలి సార్! నేను అర్జంటుగా వెళ్ళాలి సార్! మా అమ్మని హాస్పిటల్‌లో చేర్చాలి. మా ఫాదర్ చాలా కంగారుపడుతూ ఫోన్ చేసేరు సార్!" తన గోడును వెళ్ళబుచ్చుకున్నాడు శ్రీధర్ అతి వినయంగా.

"ఆ పనేదో మీ ఫాదరే చెయ్యొచ్చు కదా! రేపు మన కమీషనరుగారు వస్తున్నారు. నీకు తెలుసుకదా! ఆయన సంగతి తెలిసీ, లీవు పెడతానంటావేమిటి? ముసలాళ్ళంతేలే అలా సీరియస్‌గా వుందని చెప్తే కానీ రారని అలా చెబుతూంటారు. కమీషనర్ విజిట్ అయిపోగానే వెడుదువుగాని!" రంగనాథం ఆ విషయాన్ని క్యాజువల్‌గా తీసిపారేసి మళ్ళీ ఫైలులో తల దూర్చేడు.

"అది కాదు సార్! మా నాన్నగారెప్పుడూ అబద్ధమాడరు సార్! మా అమ్మగారికీమధ్య ఒంట్లో బాగుండటం లేదు. నేను లేకపోతే వాళ్ళకి డాక్టరుకి చూపించే దిక్కు లేదు సార్!"


"దొరికేడయ్యా సత్యహరిశ్చంద్రుడు అబద్ధాలాడరుట! అసలే మనకి సెలవులెక్కువైపోయేయని ప్రజలు మనమీదపడి తెగ ఏడుస్తున్నారు. రోజూ పేపర్లో చదవడం లేదా?" కసురుతూ మాట్లాడేడు రంగనాథం.

"సార్! వాళ్ళకి సెలవుల గురించే తెలుసుగాని మనం రోజూ పది, పదకొండు గంటలవరకు చేసే గొడ్డు చాకిరీ తెలియదు సార్! మనల్ని పెంచి పెద్దచేసి, ఇంతటి వాళ్ళని చేసిన తల్లిదండ్రుల్ని చివరి జీవితంలో మనం చూడకపోతే ఎవరు చూస్తారు సార్?" కొంచెం నిష్ఠూరంగానే మాట్లాడేడు శ్రీధర్.

"చూడు, మిస్టర్ శ్రీధర్! నువ్వు నాకు పాఠాలు నేర్పక్కర్లేదు. రేపు కమీషనర్ వస్తున్నప్పుడు, నీకు నేను లీవు ఇవ్వలేను, ఇవ్వను. అయామ్ వెరీ సారీ! యు కెన్ గో!" ఒక్కసారి సీరియస్ అయ్యేడు రంగనాథం. చిక్క మొహం వేసుకుని వెనక్కి తిరిగి ఉసూరుమంటూ కుర్చీలో కూలబడ్డాడు శ్రీధర్.

"ఏం శ్రీధర్ సెలవివ్వలేదా?" అడిగేడు కొలీగ్ రాజు.

"లేదు రాజూ! వీడి సంగతి మనకు తెలుసుకదా!"



"అందుకే నేను చెప్పేను! ఇలాంటి వాళ్ళకి న్యాయంగానూ, నిజం చెప్పి లీవడిగితే ఇవ్వరు. వెళ్ళిపోయి, మర్నాడు నాలాంటి వాళ్ళచేత ఎవరో దగ్గర బంధువు పోయేరని లీవులెటరు మొహాన కొట్టడమే!" సలహా ఇచ్చేడు రాజు.

"నేనలా అబద్ధమాడలేను రాజూ!"

"ఆడలేవు! ఇప్పుడేమయింది? అలా సత్యహరిశ్చంద్రుడిలా కాళ్ళు ముడుచుకు కూర్చుంటే నువ్వీ జన్మలో మీ అమ్మగారిని డాక్టరుకి చూపించలేవు!"

"సరే! ఈసారి నీ సలహా పాటిస్తానులే!" తన పనిలో నిమగ్నమయ్యేడు శ్రీధర్.

మరుసటిరోజు కమీషనర్ వచ్చేరు. రెండు రోజులు ఆఫీసంతా హడావిడి. మూడవరోజు కమీషనర్ వెళ్ళిపోయారు. ఇప్పుడైనా లీవు ఇస్తాడో ఇవ్వడో అనుకుంటూ నెమ్మదిగా బాస్‌రూంలోకి వెళ్ళేడు శ్రీధర్. కానీ రంగనాథం, హడావిడిగా టేబులు సర్దుకుంటున్నాడు. "రా శ్రీధర్! నేను అర్జంటుగా హైదరాబాదు వెళుతున్నాను. రెండు రోజుల్లో వచ్చేస్తాను. నేను వచ్చాక నువ్వు వెళుదువుగాని"

"సార్!" నసిగేడు శ్రీధర్.

"ఇంటి దగ్గర నుండి మళ్ళీ ఫోను వచ్చింది సార్!"

"అవున్లేవయ్యా! మా ఫాదర్‌కి బాగాలేదట. జ్వరం వచ్చిందట. ఇందాకనే ఫోను వచ్చింది. ఒకసారి చూసి వచ్చేస్తాను."

అంటే, వీడికో రూలు, మనకో రూలు నన్నమాట. తన ఫాదర్‌కి చిన్న జ్వరం వస్తేనే అర్జంటుగా వెళ్ళాలన్నమాట. కాలింగ్ బెల్ నొక్కి, అటెండర్ అప్పారావుకి బ్రీఫ్‌కేసిచ్చి, కారులో పెట్టమని, చకచకా వెళ్ళిపోయేడు రంగనాథం.

శ్రీధర్‌కి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. డీలాపడిపోయి తన సీటులో కూలబడ్డాడు. ఉసూరుమంది అతడి ప్రాణం.

రంగనాథం రెండు రోజుల తరువాత వచ్చేడు. శ్రీధర్ పెట్టిన ఫైలుని తిరగేస్తూ, అప్పారావుని శ్రీధర్‌ని అర్జంటుగా పిలవమన్నాడు.

"శ్రీధర్ బాబుగారు వూరెళ్ళేరు సార్ అర్జంటుగా!"

"అదేమిటి? నేనొచ్చేక వెళ్ళమన్నాను కదా!" సీరియస్ అయ్యేడు రంగనాథం.

"అలాగే అనుకున్నారు సార్! కానీ నిన్న వాళ్ళమ్మగారు చనిపోయినట్లు ఫోను వచ్చింది. వెంటనే వెళ్ళిపోయేరయ్యా!" చెప్పేడు అప్పారావు.

"ఆ! వాళ్ళమ్మగారు చనిపోయేరా?" అవాక్కయ్యేడు రంగనాథం.

'ఛ! రెండు రోజులు సెలవిమ్మని బ్రతిమాలేడు. తను సెలవిచ్చి వుంటే, డాక్టరుకి చూపించేవాడు కదా! అప్పుడావిడ బ్రతికేదేమో! తన మూర్ఖత్వం ఖరీదు ఒక నిండు ప్రాణం!' ఆరోజంతా సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ పరధ్యానంగానే వున్నాడు రంగనాథం. తన మూర్ఖత్వాన్ని తానే నిందించుకుంటూ!

**-బి.రాధాకృష్ణమూర్తి (విజయవాడ)**